క్లుప్తంగా

బీఈడీ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు



ప్రాక్టికల్ పరీక్షలు పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ ఫాదర్ బాల

దెందులూరు: సోమవరప్పాడులోని సెయింట్ జాన్స్ బీఈడీ కళాశాలలో గురువారం యూనివర్శిటీ ప్రాక్టికల్ 2021–23 సంవత్సరానికి సంబంధించి పరీక్షలు జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఫాదర్ పి.బాల, అధ్యాపకులు పరీక్షలు, విద్యార్థుల హాజరు శాతం గురించి పర్యవేక్షించారు. విద్యార్థులు పరీక్షకు నూరు శాతం హాజరయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు.

తెలంగాణలో విద్యార్థులకు అమ్మఒడి జమ

కుక్కునూరు : తెలంగాణ విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థులకు అమ్మ ఒడి జమైనట్టు వచ్చిన వార్తలు నిజమేనని మండలంలోని సీతారామనగరం గ్రామస్తులు వాఖ్యానించారు. గత విద్యాసంవత్సరానికి సంబంధించి సీతారామనగరం ఎంపీయూపీఎస్ పాఠశాలలో చదవని విద్యార్థుల పేర్లను పదుల సంఖ్యలో పాఠశాలలో చదువుతున్నట్టు అక్కడ విధులు నిర్వహించిన ప్రధానోపాధ్యాయుడు చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేయించినట్టు తెలుస్తుంది. ఈ విధంగా నమోదు చేయడంతో పాటు వారు రోజూ పాఠశాలకు హాజరు అవుతున్నట్టు హాజరుశాతం చూపించడంతోనే తెలంగాణ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల తల్లుల ఖాతాలలో అమ్మ ఒడి జమైనట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఇద్దరు విద్యార్థులకు అమ్మ ఒడి జమకాగా మిగిలినవారికి ఈ నెల 16వ తేదీ లోపు జమచేస్తారన్న సమాచారంతో మరి కొందరు అనర్హులకు అమ్మ ఒడి జమకానుంది. ఇది ఇలా ఉండగా చైల్డ్ ఇన్ఫోడేటా ప్రకారం విద్యార్థుల పేరున జగనన్న కిట్లు, పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజన పథకంలో గుడ్లు, బియ్యం సరఫరా అవుతాయి మరి అవన్ని ఏం చేశారన్నది తెలియాల్సి ఉంది. సుమారుగా 30 మంది విద్యార్థుల పేర్లు చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో సంబంధిత శాఖాధికారులు దీనిపై సమగ్ర విచారణ జరిపి అవకతవకలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

కోడి పందేల శిబిరంపై దాడి

ద్వారకాతిరుమల : రాళ్లకుంటలో కోడి పందేల స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఆరుగురి వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ: 4,820 నగదుతో పాటు ఒక కోడి పుంజు, కోడి కత్తి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

కరోనాలో బాధితులకు బాసట

- ఇంటింటికీ వెళ్లి సేవలు
- వలంటీర్ల సేవలపై ప్రజల్లో సంతృప్తి

వలంటీర్లకు వందనం

ఏలూరు టౌన్: 'సరిగ్గా నాలుగేళ్ల క్రితం ఇదే సమయానికి ప్రపంచమంతా కరోనా విలయ తాండవంతో అల్లాడిపోతోంది. రాష్ట్రంలోని కోట్లాది మంది ప్రజలు కరోనా భీభత్సానికి భయంతో వణికిపోయారు. ఇంటి నుంచి బయటకు రావటం మాట అటుంచితే.. సొంత కుటుంబ సభ్యులు మృత్యువాత పడినా కనీసం అంత్యక్రియలకు సైతం హాజరుకాలేని దైన్యస్థితిలో కొట్టుమిట్టాడారు. ఆ సమయంలో రాష్ట్రంలో స్వచ్ఛంద సైన్యం వలంటీర్లు కరోనా బాధితులకు బాసటగా నిలిచారు. పోలీసులు, వైద్య, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందితో కలిసి నిత్యం ప్రజల సేవల్లోనే నిమగ్నమయ్యారు. వలంటీర్లు ఆరోగ్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి కరోనా లక్షణాలు కలిగిన వారి వివరాలు సేకరించటం, పరీక్షలు చేయించటం, టెస్ట్ ఫలితాలను తెలియజేయటం, కోవిడ్ సోకితే మనోధైర్యం కలిగిస్తూ క్వారంటైన్‌లో ఉండేలా శ్రద్ధ తీసుకున్నారు. మందులు, నిత్యావసర వస్తువులు ఇంటి వద్దకే వెళ్లి ఇచ్చేవారు. శానిటేషన్ చేయటంలో పారిశుధ్య కార్మికులకు సహాయకారులుగా ఉంటూ, హాస్పిటల్స్‌కు తరలిస్తే వైద్య సిబ్బంది వెంట ఉంటూ స్ఫూర్తివంతమైన కీలకపాత్ర పోషించారు'.

చికిత్సల్లోనూ తమదైన పాత్ర

కరోనా వైరస్ నియంత్రణకు ప్రభుత్వం పెద్దెత్తున వాక్సినేషన్‌కు చర్యలు తీసుకుంది. ఆ సందర్భంలో ప్రజలకు కరోనా వాక్సిన్ వేయించటంలోనూ వలంటీర్లు కీలకంగా వ్యవహరించారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో కలిసి ప్రతి వ్యక్తికీ కరోనా వాక్సిన్ తీసుకునేలా ప్రోత్సహించారు. కోవిడ్ మహమ్మారిని అడ్డుకోవటంలో ప్రభుత్వ శాఖలతోపాటు వలంటీర్లు స్వచ్ఛందంగా ప్రాణాలకు తెగించి మరీ చేసిన సేవలు ప్రజలు మర్చిపోలేనివి. కుటుంబ సభ్యులు సైతం వదిలేసినా వంటరి మహిళలు, వృద్ధులకు కొండంత అండగా వలంటీర్లు నిలిచారు. హోమ్ క్వారంటైన్, హాస్పిటల్ క్వారంటైన్, ప్రత్యేక శిబిరాలకు కరోనా బాధితులను తరలించటం వంటి బాధ్యతలను వలంటీర్లు తమ భుజాలపై మోసారు.

ఔషధాలు అందజేస్తూ..



కరోనా వైరస్ తొలిదశలో ప్రజలు కరోనా భయంతో మానసిక వేదనకు గురయ్యారు. ఒకవైపు ప్రభుత్వం కరోనా నిరోధానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటూ కరోనా సోకిన బాధితులను హోం క్వారంటైన్‌లో ఉండాలని సూచించారు. కుటుంబ సభ్యులు సైతం కరోనా సోకిన బాధితులను కలవనివ్వలేదు. కానీ, వలంటీర్లు తమ ప్రాణాలకు లెక్క చేయకుండా ప్రజలకు అండగా నిలిచారు. ఏలూరు లంకపేట పోస్టాఫీస్ ప్రాంతంలో నివసించే మహిళకు కరోనా సోకటంతో హోం క్వారంటైన్‌లో ఉండాలని వైద్యులు సూచించారు. ఆమెకు వలంటీర్ నాగూర్, ఏఎన్ఎం జయప్రద ఔషధాలను తీసుకువెళ్లి ఇంటివద్ద అందజేశారు. ఇలా ప్రతి దశలోనూ వలంటీర్లు ప్రజలకు చేసిన సేవలు మరువలేనివి.

అవ్వా.. నేనే మాస్క్ కడతా



ఏలూరు తంగెళ్లమూడి ప్రాంతం రాణీనగర్ రామాలయం వీధిలో నివాసం ఉంటోన్న వృద్ధురాలు సీతమ్మకు కరోనా కష్టకాలంలో వలంటీర్లు అండగా నిలిచారు. కరోనా వ్యాప్తి తీవ్రస్థాయిలో ఉన్న పరిస్థితుల్లో ప్రభుత్వమే మాస్కులను కుట్టించి, ప్రతి ఇంటికీ వలంటీర్ల చేత పంపిణీ చేయించింది. వ్యక్తిగత శుభ్రత, భౌతిక దూరం పాటిస్తూ మాస్కులు ధరించాలని ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో వలంటీర్ మజ్జి హరిణి కరోనా వైరస్‌కు ఇంటింటికీ వెళ్లి మాస్కులు పంపిణీ చేసింది. ఇదే సందర్భంలో రామాలయం వీధిలోని సీతమ్మకు తానే స్వయంగా మాస్కును కట్టింది. రోజూ ఇదే విధంగా మాస్కు ధరించాలని, జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పించింది.

ఇంటింటికీ మాస్కుల పంపిణీ



కరోనా వ్యాప్తి తొలి దశలో ఏలూరు తంగెళ్లమూడి ప్రాంతం యాదవనగర్‌లో ప్రతి ఇంటికీ వెళ్లిన వలంటీర్లు వ్యక్తిగత పరిశుభ్రత, భౌతిక దూరం పాటించటం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కరోనా తీవ్ర ప్రభావం చూపుతున్న తరుణంలో ప్రాణాలకు తెగించి వలంటీర్ శివకుమారి, ఏఎన్ఎం సుకన్య ఇద్దరూ యాదవనగర్‌లోని కుటుంబానికి మాస్కులు అందజేశారు. భౌతిక దూరం పాటించాలంటూ అవగాహన కల్పించారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందించటంలో వలంటీర్ల సేవలు అభినందనీయం.

మూడు వేల ధ్రువ పత్రాల పంపిణీ



15వ డివిజన్‌లో ధ్రువ పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ రాము

ఏలూరు రూరల్: ఏలూరు కార్పొరేషన్ అధికారులు మూడు వేల మందికి వివిధ ధ్రువ పత్రాలను అందజేశారు. స్థానిక 15 డివిజన్ ఆది ఆంధ్ర నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తంగెళ్ల రాము మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆళ్లనాని సహకారంతో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు మంజూరు అయ్యాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు ఎంతో మేలు చేస్తోందని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా, పైసా ఖర్చు పెట్టకుండా ప్రజలు ధ్రువ పత్రాలు అందజేయడం మంచి పరిణామం కొనియాడారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ బాపిరాజు పరివేక్షణలో కార్పొరేటర్లు జిజ్జువరపు విజయనిర్మల, ఐనపనూరి కేదరీశ్వరితో కలిసి రాము, అధికారులు ప్రజలకు ధ్రువ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఐనపనూరి జగదీష్, జిజ్జువరపు రమేష్, కార్పొరేషన్ పీఓ కృష్ణమూర్తి, ఎంహెచ్ఓ మాలతి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాల ఏర్పాటు హర్షణీయం

జిల్లా ఇన్‌చార్జి మంత్రి విశ్వరూప్



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్

ఏలూరు(మెట్రో): ప్రజాసేవ కోసం ఎన్నికైన నాయకులు వైద్య, రక్తదాన శిబిరాలు వంటివి ఏర్పాటు చేయడం హర్షణీయమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఆవరణలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు జన్మదినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను మంత్రి విశ్వరూప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సేవతో పాటు ప్రజలకు ఆరోగ్యంపై దృష్టిసారించి వైద్య, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌కు ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. శిబిరంలో 21 మంది రక్తదానం చేశారని జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. శిబిరంలో దెందులూరు ఎమ్మెల్యే కోఠారు అబ్బయ్య చౌదరి, ఏలూరు బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి, ఏలూరు కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ కిలాడి జ్యోతి దుర్గారావు, జిల్లా వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సప్పా మోహన్ మురళి జెడ్పీటీసీలు నిట్టా లీలానవకాంతం, కడిమి రమేష్, ఎం.నీరజ, ఎంపీపీలు ఎస్.వెంకటరెడ్డి, బత్తుల రత్నకుమారి, పెదపాడు ఎంపీడీఓ నిర్మల జ్యోతి, మాజీ కార్పొరేటర్ మాగంటి హేమ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అణగారిన వర్గాలకు గుర్తింపు



జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాదరావు దంపతులను సత్కరిస్తున్న నాయకులు



జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీని సత్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అణగారిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అధిక గుర్తింపు ఇవ్వడం హర్షనీయమని జాతీయ ఎస్సీ నాయకులు పొలిమేర హరికృష్ణ అన్నారు. జెడ్పీ చైర్మన్ గంటా పద్మశ్రీ ప్రసాదరావు దంపతులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక చైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో గురువారం చైర్‌పర్సన్ దంపతులను కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. బీసీ మహిళకు జెడ్పీ చైర్‌పర్సన్ పదవిని కట్టబెట్టడం ద్వారా సీఎం మరోసారి తన గొప్పతనాన్ని చాటుకున్నారని హరికృష్ణ గుర్తుచేశారు. పద్మశ్రీ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.విజయరాజు, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీకి సత్కారం

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. పద్మశ్రీ దంపతులను దుశ్శాలువాతో సత్కరించి ఫొటో అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బ్లడ్ బ్యాంక్, మెడికల్ క్యాంపుల్లో పలువురు బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు. పద్మశ్రీ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	98	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	24	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	07–10
బెండకాయలు	30	కంద	40
పచ్చిమిర్చి	80–84	బీట్‌రూట్	40
కాకర కాయలు	40	కీరా దోస	48
బీరకాయలు	28	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	44	అల్లం	188–260
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	40	పాలకూర	12
దొండకాయలు	24	చుక్కకూర	12
బంగాళదుంపలు	24	తోటకూర	12
ఉల్లిపాయలు	24	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	30	బఠాణి	--
ఆనబకాయ (1)	20–25	క్యాప్సికమ్	108
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	26
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	37
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	23
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	33
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	13
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	27
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	09.00	4794	రద్దు
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు –తిరుపతి	16.00	4830	29

'దిగజారుడు వ్యాఖ్యలు మానుకో..'

దెందులూరు: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దిగజారుడు వ్యాఖ్యలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం ఏలూరు జిల్లా చైర్మన్ గూడపాటి శ్రీనివాస్ పవన్ కుమార్ హితవు పలికారు. గురువారం దెందులూరు ఎమ్మెల్యే కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వలంటీర్లపై నిరాదరణ ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. రాజకీయ ఉనికిని కోల్పోతామని భయపడుతున్న పవన్‌కళ్యాణ్ తన యజమాని చంద్రబాబు స్క్రిప్ట్‌ను చదివి వినిపిస్తున్నాడన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ ద్వారా 30 వేల మంది ఆడపడుచులు తప్పిపోయిన సంగతి నిజమైతే ఒక్క పోలీస్ స్టేషన్‌లో కూడా ఒక్క కేసు కూడా ఎందుకు నమోదు కాలేదో పవన్‌కళ్యాణ్ చెప్పాలన్నారు. ఐటీ విభాగం సభ్యులు తదితరులు ఉన్నారు.

'వలంటీర్లను విమర్శిస్తే ఊరుకోం'

దెందులూరు: అహర్నిశలు ప్రజల అభివృద్ధి, సంక్షేమం, పథకాల అమలును సకాలంలో ప్రజలకు చేరవేస్తున్న వలంటీర్లను విమర్శిస్తే ఊరుకునేది లేదని కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య అన్నారు. అన్ని రాష్ట్రాలు ఏపీలోని వలంటీర్లు, సచివాలయాల వ్యవస్థ వైపు చూస్తున్నారు. రాష్ట్రంలో పవన్‌కళ్యాణ్, పచ్చపార్టీకి ఉనికిని కోల్పోతామని వలంటీర్లపై వారి సేవలపై విషం చిమ్మటం సరికాదన్నారు. వచ్చే ఎన్నికల్లో పవన్‌కళ్యాణ్‌కు, పచ్చపార్టీకి గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

ఏలూరులో మెప్మా అర్బన్ మార్కెట్

ఏలూరు మేయర్ నూర్జహాన్



మెప్మా అర్బన్ మార్కెట్‌లో ఉత్పత్తులను పరిశీలిస్తున్న మేయర్ నూర్జహాన్



దివంగత వైఎస్సార్, సీఎం జగన్ చిత్రపటాల ఫ్రేమ్‌తో మేయర్ నూర్జహాన్

ఏలూరు టౌన్: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తూ వారి కుటుంబాలను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని ఆదేశాలతో డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు చేసేలా మెప్మా అర్బన్ మార్కెట్ ఏర్పాటుచేశారు. మార్కెట్‌లోని స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన వివిధ రకాల వస్తువులు, కళారూపాలను, ఆహార పదార్థాలను, గాజులను డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, మెప్మా పీడీ ఇమ్మానుయేల్ తోపాటు మేయర్ నూర్జహాన్ పరిశీలించారు. వస్తువుల నాణ్యత, ఉత్పత్తికి సంబంధించిన వివరాలను మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రాష్ట్రంలో డ్వాక్రా మహిళలు ఉత్పత్తి చేసిన వస్తువులు, పదార్థాలకు జాతీయ, అంతర్జాతీయ బ్రాండింగ్ వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని తెలిపారు. ఈ కామర్స్ విధానంలో ఆమెజాన్ వంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలతో రాష్ట్ర సర్కారు ఒప్పందం చేసుకున్న నేపథ్యంలో మహిళల ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ప్రోత్సాహం లభిస్తోందని చెప్పారు. డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు నేరుగా వినియోగదారునికి ఇంటికే డెలివరీ చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మహిళలకు ఒకవైపు బ్యాంకర్ల ద్వారా రుణాలు మంజూరు చేస్తూ, మరోవైపు ఉత్పత్తులకు బ్రాండింగ్ చేసేలా కార్యాచరణ ప్రణాళికతో పనిచేస్తున్నామని మేయర్ వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జిజ్జువరపు విజయనిర్మల, కోఆప్షన్ సభ్యులు నీతా జైన్, మాజీ డిప్యూటీ మేయర్ గంపల బ్రహ్మావతి, నాయకులు తోట శివ, టీఎల్ఎఫ్ వన్‌టౌన్ అధ్యక్షులు దాసరి వరలక్ష్మి, టూటౌన్ అధ్యక్షుడు ఎస్‌కే అమీనా అన్సారీ, మెప్మా సీఎంఎం సుధాకర్, సీఓలు, ఆర్‌పీలు, డ్వాక్రా సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్, నాయకులు

పెదవేగి : ప్రజలకు సంక్షేమ పాలన అందించడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. పెదవేగి మండలం అంకన్న గూడెంలో గ్రామ సచివాలయ భవనం, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ గురువారం ప్రారంభించారు. గ్రామానికి విచ్చేసిన అతిథులకు స్థానిక నాయకులు, పూర్ణకుంభం, పూలమాలలు, బాణాసంచాలతో ఘనస్వాగతం పలికారు. అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులందరూ పథకాలను సద్వినియోగ పరుచుకోవాని, సాంకేతిక పరిజ్ఞానం లోపంతో అర్హులైన లబ్ధిదారులకు పథకాలు ఏమన్నా అందకపోతే, దరఖాస్తు చేసుకునేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. రోజుకో గ్రామంలో అర్జీలు సేకరించి తక్షణమే పరిష్కారం దిశగా చర్యలు తీసుకుని స్థానిక నాయకులతో పాటు మండల స్థాయి అధికారులు అందరూ అందుబాటులో ఉండే విధంగా కార్యక్రమం రూపొందించిన ఘనత కూడా సీఎంకే దక్కుతుందన్నారు. జెడ్పీ చైర్ పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాదరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనకి, ప్రస్తుత పాలనకి ఉన్న తేడాను గమనించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమల విజయబాబు, జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ ఆశ, పెదవేగి ఎంపీపీ తాతా రమ్య, అంకన్నగూడెం సర్పంచ్ దుక్కిపాటి మహాలక్ష్ముడు, ఎంపీటీసీ పిల్లి రామకృష్ణ, కొప్పాక సొసైటీ అధ్యక్షుడు వల్లగొల్ల భూస్వామి, బి సింగవరం సర్పంచ్ పరసా సరస్వతి సాంబశివరావు, గ్రామనాయకులు మోరవనేని భాస్కరరావు, జానంపేట మాజీ సర్పంచ్ జానంపేట బాబు, కస్వీనర్లు మొరపనేని గోపాలరావు, వల్లే ధనేశ్వరరావు, చిట్నూరి సత్యనారాయణ, పినకడిమి ఎంపీటీసీ గెడ్డం సుజాత, పెదవేగి మండల తహసీల్దార్, ఎంపీడీవో, ఇతర నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.